కథ

# పంజరంలో బాల్యం

**నిద్రలోంచి ఒక్కసారి ఉలిక్కిపడి లేచాను. పీడ కల! భయంకరమైన పీడ కల! మమ్మీ, డాడీ కలసి నన్నెక్కడికో కొండల మీదికి తీసుకెళ్ళారుట. కింద నుంచి నన్ను పైకి ఎక్కిస్తున్నారు. నేనేమో ఎక్కలేకపోతున్నానట. కొండ మీంచి వేళ్ళాడుతున్న చెట్టు కొమ్మలేవో పట్టుకుని పైకి ఎక్కుతుంటే తటాలున ఆ కొమ్మ కాస్తా ఊడి చేతికొచ్చింది. అంతే! అంతెత్తు కొండ మీంచీ లోయలోకి పడిపోయాను. గభాల్న నిద్ర లేచాను. లేకపోతేనా చచ్చిపోయేదాన్నే!**

భయం భయంగా చుట్టూ చూశాను. నా గదిలోనే ఉన్నాను. అంత పెద్ద మంచం మీదా నేనొక్కర్తినే! అవును. ఈ మధ్య కొన్ని రోజుల్నించీ నేనొక్కర్తినే పడుకుంటున్నాను. అప్పట్నించే నాకీ పీడ కలలు మొదలయ్యాయి. అంతకు ముందయితే, ఎంచక్కా తాత దగ్గర పడుకొనేదాన్ని. ఎవరి దగ్గర నేర్చుకున్నాడో గానీ, తాతకి బోలెడు కథలొచ్చు. అదేమిటో గానీ తాత కథలు నేను పూర్తిగా వినేదాన్ని కాదు, వింటుంటే నిద్ర వచ్చేసేది. ఆ నిద్రలో నాకు మంచి మంచి కలలొచ్చేవి. కలలో నేనేమో తెల్లటి బుట్ట గౌను తొడుక్కుని మా తాత వీపు మీద కూర్చునేదాన్ని. తాతేమో హనుమంతుడిలాగా గాల్లో తేలుతూ నన్ను పార్కు కంటే పార్కుకి, బీచ్ కంటే బీచికీ, జూ కంటే జూకీ తీసుకెళ్ళేవాడు. అక్కడికెళ్ళాక నాకు ఏది కావాలంటే అది ఛూమంత్రం చేసి తెప్పించి ఇచ్చేవాడు. మరేమనుకుంటున్నారు. మా తాతంటే, అంటూ మిగిలిన పిల్లలందర్నీ గేలి చేసేదాన్ని. తాత చేత కూడా వాళ్ళకి ఢిల్ల చెప్పించేదాన్ని. హుఁ అట్లాంటి మంచి మంచి కలలేమి ఇపుడు రావట్లేదు.

గోడ మీద గడియారం టిక్కు టిక్కు అంటోంది. అది అలా అంటుంటే నాకు భయం. ఆరింటికల్లా లేవకపోతే ఆ గడియారం కుక్కూ కుక్కూ అంటూ అరిచేసి అమ్మకి చెప్పేస్తుంది. వెంటనే మమ్మీ ఎక్కడున్నా సరే "కావ్యా లేమ్మా! ఆరైందీ" అంటుంది. ఇంకా అలాగే పడుకుంటాను నేను. అపుడు మమ్మీ గదిలో కొచ్చి "కావ్యా లేమ్మా స్కూలు కెళ్లాలీ" అంటుంది. ఎందుకోగానీ ఆ స్కూలన్న పదం వింటేనే నాకు జ్వరం వచ్చినట్లనిపిస్తుంది.

జ్వరం! జ్వరం వస్తే ఎంత బావుంటుంది? అసలీ జ్వరం రోజూ ఎందుకుండకూడదూ అనిపిస్తుంది నాకెప్పుడైనా జ్వరం వస్తే?... జ్వరం వచ్చినపుడు అయితే ఎంచక్కా మమ్మీ ఆఫీను మానేసి నాతోటే ఉంటుంది. మమ్మీ ఇంట్లో నాకు భలేగా ఉంటుంది! సుస్మితా వాళ్ళ మమ్మీ అయితే ఎపుడూ ఇంట్లోనే ఉంటుంది. వాళ్ళ మమ్మీ పొద్దుటే దానిని ఎత్తుకొని అన్నం పెడుతుంది. మధ్యాహ్నం వాళ్ళ మమ్మీ అది ఒకే మంచం మీద పడుకుంటారు. సుస్మితా లేచేసరికి వాళ్ళ మమ్మీ దానికి ఏదో ఒక అప్పచ్చి చేసి పెడుతుంది. అపుడపుడూ నాక్కూడా అప్పచ్చి పెడుతుంది వాళ్ళ మమ్మీ. మా మమ్మీ కసలు అప్పచ్చిలు చెయ్యడమేరాదు. రోజూ పొద్దున్నే వెళ్ళి రాత్రికి వస్తుంది. రాగానే అప్పచ్చి చెయ్యమని అడిగితే "తిండిపోతులా తయారవుతున్నావేమిటి? ఎప్పుడూ తిండి యావేనా? ఇవాళ్ళ స్కూల్లో ఏం చెప్పారూ, ఏమేం హెూం వర్కు లిచ్చారూ? ఇవేవీ మాట్లాడవే? రాగానే అప్పచ్చి! అని విసుక్కుంటుంది. ఆదివారం అయినా కూడా మమ్మీకి అప్పచ్చిలు చేసే ఖాళీ ఉండదు. వారం రోజుల బట్టలూ ఉతికారేసి ఇస్త్రీ చేస్తుంది. దాంతోటే అయిపోతుంది. అసలీ ఆఫీసులెందుకున్నట్టారో! బహుశా, చిన్నవాళ్ళని స్కూల్లో వెయ్యకపోతే బ్యాడ్ గాళ్స్ అయిపోతారే అలానే పెద్దవాళ్ళని ఆఫీస్‌లో వెయ్యకపోతే బ్యాడ్ గాళ్స్ అయిపోతారనేమో!


పక్క మీద నా బార్బీ బొమ్మ నా పక్కనే పడుకుంది. తాత పడుకోవడం మానేశాక బార్బీనే నా దగ్గర పడుకోబెట్టుకుంటున్నా! బార్బీ గాఢంగా నిద్ర పోతోంది. దానికి దుప్పటి కప్పి, మళ్ళీ పడుకున్నాను. మళ్ళీ నిద్ర పట్టింది. కలలు - పీడ కలలు: స్కూల్లో పిల్లలంతా ఒక పడవలో కూర్చుని ఒక నదిలో వెళ్తున్నాంట. మా మేడమ్స్ ఇంకో పడవలో కూచుని అక్కడికొచ్చింది. వచ్చి, తన తెడ్డుతో మా పడవని బోల్తా పడేసింది. మేమంతా నీళ్ళల్లో పడి కొట్టుకుపోతూ ఉంటే మేడమ్ మాత్రం సినిమాల్లో ఆడ రాక్షసుల్లాగా నవ్వుతూ "హహ్హా హ్హా! ఈ దేవీరామ్ మేడమ్ అంటే ఏంటనుకున్నారు? చంపేస్తా, చీరేస్తా! పాతేస్తా" అని అరుస్తోంది. నాకేమో నీళ్ళు ముక్కుల్లోకీ చెవుల్లోకీ వెళ్ళిపోతున్నాయి. ఇంక లేవకపోతే చచ్చిపోతానేమో అనిపించి వెంటనే లేచి కూర్చున్నాను. బార్బీ మాత్రం హాయిగా నిద్ర పోతూంది. దానికి పీడ కలలు రావేమో! అవునులే అది బడికెళ్ళదుగా, అందుకే దానికి పీడ కలలు రావు!

గడియారం కేసి చూశా. టిక్కూ టిక్కూ అంటూనే ఉంది. అసలీ గడియారానికి నిద్ర రాదా? ఎప్పుడు జారుకున్నానో గానీ మళ్ళీ నిద్రలోకి జారుకున్నాను.

"కుక్కూ కుక్కూ!" అంటూ గొంతు చించుకుని అరుస్తోంది గడియారం. నాకు వినపడినా లేవలేదు. మమ్మీ లేపితేనే గానీ లేవబుద్ధి అవ్వదు కాదు నాకు. అనుకుంటుండగానే మమ్మీ వచ్చింది. "కావ్యా లేమ్మా స్కూలుందీ" అంది. నేను లేవలేదు. జబ్బలు పట్టుకుని కుదిపింది. ఆ రోజు తాత కూడా లేవకపోతే మమ్మీ వెళ్ళి డేడీతో చెప్పింది. డేడీ వచ్చి ఇలానే జబ్బలు పట్టుకుని కుదిపి కుదిపి లేపాడు. అయినా తాత లేవలేదు. ఇంకా నిద్రపోతున్నాడు. డేడీ మాత్రం మమ్మీతో "పోయార"ని చెప్తున్నాడు ఉత్తదీ- ఎక్కడికీ పోతా? ఎక్కడికీ పోలేదు నిద్రపోతున్నాడు. మరి డేడీ ఏంటి పోయారంటాడు?

"లేమ్మా కావ్యా స్కూలుకి లేటుగా వెళ్తే గేట్ వేసేస్తారు. లేమ్మా లేచి గుడ్‌గాళ్‌లా మొహం కడుక్కో" అని నన్ను లేపి కూర్చోబెట్టింది. మమ్మీ. ఉత్తది, మమ్మీ అలా అంటుంది. అన్ని పనులూ తనే చేసేస్తుంది. గబగబా పళ్ళు తోమేసింది. పాలు తాగేశాక బాత్రూమ్‌లోకి తీసుకెళ్ళి పెద్ద మగ్గుతో నీళ్ళు దిమ్మరించేసింది నా మీద. ఆ రోజు కూడా ఇలానే- తాత ఎంతకీ లేవట్లేదని కోపం వచ్చి, అందరూ తలో బక్కెట్ నీళ్ళు తెచ్చి తాతమీద దిమ్మరించారు. పావం! ముక్కులోకి కూడా నీళ్ళు వెళ్ళిపోయాయి తాతకి! అన్ని బకెట్స్ నీళ్ళు పోసినా కూడా ఎవ్వరూ తాతకి సబ్బు రుద్దలేదు! టవల్‌తో తుడవలేదు కూడా పావం!

నాకు మమ్మీ గబగబా పౌడరు రాసింది, బొట్టు పెట్టింది, జడ వేసింది. స్కూల్ యూనిఫాం తెచ్చి వేసింది. బెల్ట్ గట్టిగా బిగించింది. మెడ దగ్గర నొక్కేస్తూ పై ఒకటి! ఆ రోజు- పావం, తాతని కూడా ఇలాగే గట్టిగా తాళ్ళతో కట్టేశారు. తాతకి నెప్పి పుట్టిందేమోనని కూడా




## వక్కలంక సుబ్రహ్మణ్యం

అడగలేదు ఎవ్వరూ!

'పాంపాం' అంటూ స్కూలు వ్యాను హారను మోగింది. వ్యాన్‌లోకి ఎక్కించింది మమ్మీ. వ్యాన్ తలుపులు మూసేశారు. ఆ రోజు తాతని కూడా ఇలాంటి వ్యానులోనే ఎక్కించేరు. డేడీ ఒక్కడే తాత కూడా వెళ్ళారు. తాత నెక్కడొదిలేసేరో గానీ, డేడీ మాత్రం ఒక్కడే వెనక్కి వచ్చాడు. తాత ఉంటే ఎంత బావుండేది?

తాత ఉంటే ఇంచక్కా నన్ను బడికి వెళ్ళనిచ్చేవాడు కాదు. "ఒరేయ్, తిన్నగా మూడేళ్ళు కూడా రాని ముండకి బడేవిట్రా?" అని డేడీతో దెబ్బలాడేవాడు. డేడీ ఏమో, తప్పు చేసిన వాళ్ళా మొహం పెట్టి "మీకు తెలియదండీ. ఈ రోజుల్లో అంతా కాంపిటీషన్. జనాలంతా పరుగెడుతుంటే మనం తాపీగా నడుస్తామంటే ఎలాగండీ? మనమూ వాళ్ళతో సమానంగా పరుగులె

త్రాలి'' అనేవాడు. ఏవిటో నాకైతే ఏమీ అర్థమవ్వదు. వరుగెత్తుతూ స్కూలు కెళ్తారా? వ్యాన్లో వెళ్తారు గానీ! నాకే కాదు, తాతకి కూడా అర్థమయ్యేది కాదు, ''నాకేం నచ్చలేదురా ఇది. రెండేళ్ళ వయస్సులో ఈ వసిదానికి ఇంత భారమ్మోపేస్తే, ఇంకది పెద్దయినాక తన బాల్యాన్ని గుర్తు తెచ్చుకోవడానికి మనలా ఏమన్నా తీపి జ్ఞాపకాలు మిగులుతాయంటావా? అయినా మూడేళ్ళొనిండేక యెల్కేజీలో వెయ్యొచ్చు గదా, ఈ నర్సరీల్లో ప్రీనర్సరీల్లో ఎందుకురా?'' అనేవాడు. మధ్యలో మమ్మీ కల్పించుకుని, ''దానికి మీ అబ్బాయి గారికి తెలిసున్న వాళ్ళెవరి ద్వారానో పబ్లిక్ స్కూల్లో చేర్పించాలని చూస్తున్నారండీ. ఆ స్కూల్లో సీటు రావాలనే ఈ స్కూల్లో చేర్పించాం'' అనేది.

తాతకి ఎన్ని చెప్పినా అర్థమయ్యేది కాదు. ''మీరెన్నైనా చెప్పండిరా? 'రాజవత్పంచవర్షాణి' అన్నారు. దాంట్లోంచి రెండేళ్ళు తీసేసేము ఈ ఇంగ్లీషు చదువులొచ్చాక. ఆ మిగిలిన మూడేళ్ళలోంచీ కూడా మరో ఒకటిన్నర తీసేస్తామంటే ఇంకా జీవితంలో వన ఏముంది? ఒరెయ్! నేనూ నువ్వూ మీ యావిడా ఎప్పుడూ స్కూల్లో జేరింది! మనకంటూ ఓ బాల్యం వుంది. అయినా దాని అవసరం మీకప్పుడే తెలీదు. నాలా రిటైరయ్యాక జ్ఞాపకాలు నెమరు వేసుకునేటపుడు మీకు తెలుస్తుంది'' అనేవాడు.

ఏమిటో తాతెప్పుడూ నాకు బాల్యం లేదనే బాధపడేవాడు. అసలయం అంటే ఏమిటో? అదే తాతనడిగా ఓ రోజు! అపుడు తాతేమో చిన్నికృష్ణుడు చిన్నప్పుడు పిల్లలతో కలసి ఎలా ఆడుకున్నాడో, వెన్నలన్నీ దొంగిలించి ఎలా తినేవాడో, స్నానాలు చేసేవాళ్ళ చీరలు ఎలా ఎత్తుకు పోయేవాడో, మధ్యాహ్నం అప్పుడు పిల్లలతో కలిసి లంచ్ బాక్సులు ఎలా తినేవాడో- అదేదో పుస్తకంలోంచి చదివి చెప్పేవాడు. మొత్తానికి చిన్నికృష్ణుడు బాల్యంలో బాగా ఆడుకున్నాడన్నమాట అనుకునే దాన్ని. ''మరి బాల్యం ఎప్పటికీ ఉంటుందా తాతా?' అనడిగితే తాతనవ్వి,'' లేదే, కావమ్మా! అక్షరాభ్యాసం అయినంతవరకే బాల్యం. బళ్ళో చేరాక బాల్యం అయిపోతుందన్నమాట.''

వ్యాను స్కూలు దగ్గర ఆగింది. అందరూ మెల్లిగా దిగుతున్నారు. ఎవరి క్లాసుల్లోకి వాళ్ళు వెళ్తున్నారు. నా క్లాసులో నాకు ఎదోలా ఉంటుంది. మిగిలిన పిల్లలంతా ఏడుస్తూ ఉంటారు. పెద్దాస్పత్రిలో 'పిల్లల డాక్టరు బయట నాకు ఇంజక్షనొద్దో అని ఏడిచే పిల్లల్లా ఏడుస్తూ ఉంటారు. మొదటయితే ఆయాలు ఏడ్చేవాళ్ళకి చాక్లెట్లు ఇచ్చేవారు కానీ ఇప్పుడు అయితే ఏడిస్తే కొడతారు. నాకుమాత్రం తాతని గుర్తు చేసుకుంటే చాలు, ఏడుపు రాదు. తాత ధైర్యంగా ఉండాలనీ భయపడ కూడదనీ నేర్పాడు. నాకు ఓ సారయితే మా ఎక్కింటి వాళ్ళ కుక్కని చూసి భయపడి ఏడిచాను. అపుడు తాతనన్ను ఆ కుక్క దగ్గరికి తీసుకెళ్ళాడు. ముందు తను ఆకుక్కని నిమిరాడు. అదేమీ అనలేదు. పైగా తోక ఊపింది. కొంచెం సేపటికి నాక్కూడా ఆకుక్కని ముట్టుకోవాలనిపించింది. తాతేమో గుడ్ గాళ్సని కుక్కలేమీ చేయవని కావాలంటే ముట్టుకుని చూడు అన్నాడు. నేను గుడ్‌గాళ్ అని నాకు తెలును కాబట్టి ధైర్యంగా ఆకుక్కని ముట్టేనుకున్నాను. అప్పట్నించీ నాకు ధైర్యం వచ్చేసింది. అసలు ఏడుపురాదు స్కూల్లో.



''ఏమండీ! మన టీవీ చెడి పోయిందండీ మాటలు రావడం లేదు'' ఆందోళనగా చెప్పింది భార్య.
''అదేంకాదు! మన దూరదర్శన్ వాళ్లు పాత కాలవు మూగ సినిమా వేశారు. వెరైటీ కోసం!'' చెప్పాడు వివరించి భర్త.
-రాయవరపు రవి
రామాయంపేట

''కావ్యా స్టాండప్ అండ్ సే గుడ్‌మార్నింగ్ మేడమ్'' ఎప్పుడొచ్చిందో ఏమో గానీ దేభిరం మేడమ్ అందరూ నుంచుని గుడ్మాణింగ్ చెప్తే నేను చెప్పలేదని కోపంగా అరుస్తోంది. మళ్ళీ తాత గుర్తొచ్చాడు. అస్తమానూ''కావమ్మా మీ టీచరు పేరేమిటే?'' అని అడిగి, నేను దేభిరం అనగానే నవ్వేసేవాడు. నేనూ నవ్వేసే దాన్ని.

''కావ్యా వై ఆర్యూ లాఫింగ్?'' మళ్ళీ దేభిరం అరిచింది. టూ రాసి చూపించమంది. ''ఓస్! అదెంత పని?'' అని వెంటనే రాసి చూపించా! దేభిరం మేడమ్ సంతోషించలేదు సరికదా మరింత కోపం వచ్చింది నేను రాసింది చూసి, ఇంగ్లీషులో తిడుతోంది ''నాట్‌టూ, ఐవాంట్ టూ టేబిల్'' ఈ దేభిరం మేడం ఎందుకిలా తిడుతోందో నాకర్థం కావట్లేదు. నేను మాత్రం టూ చక్కగా రాశాను. అదే మా తాతయితే నేనేది రాసినా ఆవలక తీసుకెళ్ళి మమ్మీకి డేడీకి చూపించి'' చూశారా, మా కావమ్మకి ఎన్నొచ్చేస్తున్నాయో'' అంటూ అందరి చేత బావుందని పించేవాడు. ఈ దేభిరానికి ఎన్నిరాసినా తృప్తే ఉండదు. అయిపోయింది నావని. ఇపుడు దేభిరం మా మమ్మీకి ఇంగ్లీషులో ఉన్నవీ లేనివీ చెప్పేస్తుంది- ''మీ కావ్యా చాలా డల్లండీ. క్లాసులో అస్సలు మాట్లాడదు, టూటేబిల్ రాయమంటే టూ రాసేసి ఊరుకుంటుంది.'' అనుకుంటూ ఆ తరువాత ఇంటిదగ్గర మమ్మీ డేడీలకి కోపం వస్తుంది. నాకేడుపు వస్తుంది. ఇపుడు తాత కూడాలేడు. ఊరడించడానికి. ఏడ్చినంతసేపు ఏడ్చి నేనే పడుకోవాలి. నాకేడుపు వచ్చేసింది. తాతా అంటూ బావురుమన్నాను.

''డోంట్ క్రై'' దేభిరం అరుస్తోంది.

* * *

బెల్ కొట్టారు.

మళ్ళీ స్కూల్ వ్యాన్లో ఎక్కి కూర్చున్నాక తాత గుర్తుకు వచ్చేడు. రోజూ ఇంటి దగ్గర వ్యాన్ ఆగే చోట నిలబడి ఉండేవాడు. నేను దిగగానే ఇంచక్కా ఎత్తుకుని ఇంటికి తీసుకువచ్చేవాడు.

తాతవెళ్ళిపోయాక ఇవుడు రాజు వస్తుంటాడు రాజా. రోజు కూడా చిన్నాడే కానీ కొంచెం సుర్మిత వాళ్ల సాయన్నంత ఉంటాడు. రాజైతే నన్నెత్తుకోడు. నడిపించి తీసుకెళ్తాడు. నడిపించి కూడా కాదు వరుగెత్తించి వరుగెత్తించి లాక్కుని పోతూ ఉంటాడు. 'ఇంటి దగ్గర తమ్ముడొకడే ఉన్నాడు, లేచాడంటే భయపడతాడు, త్వరగా నడువు కావ్యా'' అని తొందరపెడతాడు.

''కావ్యా దిగాలి, మీ ఇల్లొచ్చిందీ'' వ్యాన్లో మెట్ల మీదబ్బాయి అరుస్తున్నాడు. గబ గబా లేచాను. కింద రాజు రెడీగా నించున్నాడు.

ఇంటికెళ్లగానే 'కావ్యమ్మా, నువ్వు హోంవర్కులు చేసుకుంటూ ఉండూ, నేనెళ్ళి పాలు తీసుకొస్తాను. తమ్ముడు లేస్తే ఆడించూ' అనేసి రాజు పాలకెళ్లిపోయాడు.

ఒక్కదాన్నే ఉన్నాను. తమ్ముడి దగ్గరికి వెళ్ళాను. వాడైతే ఇంచక్కా రోజూ మమ్మీ దగ్గరే వడుకుంటాడు. హాయిగా నిద్రపోతున్నాడు తమ్ముడు. అవును వాడికిబడి లేదుగా అందుకే పీడకలలు లేకుండా హాయిగా వడుకుంటాడు.

కానీ, తాత మాత్రం తమ్ముణ్ణి చూసినా కూడా బాధవడుతుంటాడు ఎందుకో! సీసాలో పాలు ఇస్తున్నప్పుడు 'ఏ జన్మలోనో తల్లీ పిల్లల్ని విడదీసి ఉంటావు, ఈ జన్మలో ఉద్యోగం చేసే తల్లికి పుట్టావు! పట్టుమని నెల కూడా తల్లిపాలెరగవు'' అని సణుక్కుంటూ ఉండేవాడు. అదంతా నాకర్థం అయ్యేదికాదు. నా కర్థమయ్యిందల్లా ఒక్కటే- తొందరలోనే తమ్ముడు కూడా నాలా బడికెళ్తాడు. అపుడు వాడికి కూడా దేభిరంమేడం కలల్లోకి వచ్చి భయపెడుతుంటుందని.

నన్ను బళ్ళోవేశారు. ఇంక నన్ను ఆదేభిరం నించి ఎవరూ కాపాడలేరు. బళ్ళో వేసేస్తే బాల్యం అయిపోయిందని తాత కూడా చెప్పేడు.

ఇంక ఇవుడు తమ్ముడు నాలా గబగబా పెద్దవాడు అవ్వకుండా చూడాలి. వాడికి బాల్యం అవుడే అయిపోకూడదు. చాలా రోజులుండాలి. వాడికి పీడకలలు రాకూడదు. వాడిలాగే రోజూ మమ్మీ దగ్గరే వడుకోవాలి. భూర్చీ వక్కన వడుకోకూడదు. వాడి కలల్లోకి దేభిరం మేడమ్ రాకూడదు.

అందుకు ఏమిటబ్బా మార్గం? తమ్ముడు పెద్దవాడు అవ్వకుండా ఎవ్పటికీ బాల్యంలో ఉండాలంటే ఏం చేయాలి?

ఆఁ గుర్తొచ్చింది! తాత నన్నెప్పుడూ ముఖం నిండా దుప్పటీ కప్పుకోనిచ్చేవాడు కాదు. మనందరికీ గాలి చాలా అవసరంట! ముఖం నిండా కప్పేసుకుంటే గాలి ఆడక మరణిస్తారట.

మరణించడం అంటే ఏంటని తాతని ఓ రోజు అడిగాను. తాతేమో ఒక అయిదు నిముషాలు ఆలోచించి, 'మరణించడం అంటే- ఇంక వాళ్ళు పెద్దవాళ్ల వ్వరన్నమాట! మమ్మీ డేడీ అంత అవ్వరన్నమాట. అందుకని ముఖం నిండా కప్పుకోకూడదు' అన్నాడు.

అవును బాగానే గుర్తొచ్చింది. ఇంక ఆలస్యం చెయ్యదలచుకోలేదు. తమ్ముణ్ణి ఆ దేభిరం బారి నుంచి నేనే కాపాడాలి.

తమ్ముడి కేసి చూశాను. రెండు పిడికిళ్ళు గట్టిగా మూసుకుని బజ్జుకున్నాడు. ఎంత ముద్దొస్తున్నాడో తమ్ముడు!

''నువ్వేం భయపడకు తమ్ముడు. నువ్వు పెద్దవాడవ్వకుండా నేను చూస్తాను. ఇంచక్కా ఎప్పుడూ బాల్యంలోనే ఉండొచ్చు. చిన్ని కృష్ణుడిలా ఆడుకుంటూనే ఉండొచ్చు. స్కూల్లో వెయ్యరు. పీడకలలు రావు. ఏం?'' అన్నాను తమ్ముడితో ఏమర్థమయ్యిందో గానీ తమ్ముడు నిద్రలోనే నవ్వుతున్నాడు.

మెల్లిగా మంచం ఎక్కాను. కాళ్ల దగ్గర వరిచి ఉన్న డేడీ రొజాయి తీశాను అమ్మో, ఎంతబరువుందో! లాగలేక లాగలేక లాగి తమ్ముడికి నిండా కప్పేశాను.

హమ్మయ్యా! ఇంక మా తమ్ముడి బాల్యాన్ని ఎవరూ ఏం చేయలేరు.